క్లుప్తంగా

ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాలెం: అర్హులైన వివాహితులు ఆశా కార్యకర్తల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రవితేజ నాయక్ సోమవారం తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెం-1, మొక్కపాడు-1, గ్రామాలలో ఆశా కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు ఈ నెల 27వ తేదీ లోపు స్థానిక ఆరోగ్య కేంద్రంలో దరఖాస్తు అందజేయాలని అన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులు, ఆ గ్రామ కోడలై ఉండాలని సూచించారు. దరఖాస్తుతో పాటు గ్రామ ఆరోగ్య, పారిశుద్ధ్య కమిటీ నిర్వహించిన తీర్మానం కాపీని జత చేయాలని తెలిపారు.

సీపీఐ మండల కార్యదర్శిగా నాగులు మీరా


నాగుల్ మీరా


ఏసుబాబు

పెదకూరపాడు: పెదకూరపాడు మండల సీపీఐ కార్యదర్శిగా పఠాన్ నాగులు మీరా, పెదకూరపాడు పట్టణ సీపీఐ కార్యదర్శిగా నేలపాటి ఏసుబాబు, పెదకూరపాడు మండల సీపీఐ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. అనంతరం నాగులు మీరా, ఏసుబాబు మాట్లాడుతూ ఏకగ్రీవంగా తమను ఎన్నుకున్నందుకు జిల్లా, నియోజకవర్గ సీపీఐ పార్టీ వర్గాలకు కృతజ్ఞతలు తెలిపారు. సీపీఐ బలోపేతానికి కృషి చేస్తామని, మండలంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటామన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు.

పీహెచ్‌సీ ఉద్యోగులు బదిలీ



క్రోసూరు: వైద్య ఆరోగ్య శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఆ శాఖ ఉద్యోగులను బదిలీ చేసింది. అందులో భాగంగా క్రోసూరు పీహెచ్‌సీలో పనిచేసే ముగ్గురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ షేక్ జానీబాషా, స్టాఫ్‌నర్సు పి.రాణి గుంటూరు జీజీహెచ్‌కు, క్రోసూరు సీహెచ్‌వోగా పనిచేస్తున్న సాంబశివరావు పెదకాకాని పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. సోమవారం బదిలీ ఉత్తర్వులతో రిలీవ్ అయ్యారు. వీరి స్థానంలో కొత్తవారు రావాల్సి ఉంది. ఉద్యోగులు బదిలీ అయిన సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సాద్, డాక్టర్ నాయక్, డాక్టర్ సిరిచందన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఎల్‌టీ ప్రభాకరరావు, స్టాఫ్‌నర్సు అంజమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ప్రమాదంలో ఇరువురికి గాయాలైన ఘటన మండలంలోని ఇరుకుపాలెం గ్రామ సమీపంలోని చెరువు వద్ద సోమవారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గోళ్ళపాడు గ్రామానికి చెందిన గురజాల కోటయ్య, నాగరాజులు సిమెంట్ పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లికి బయలుదేరారు. మార్గంమధ్యలో ఇరుకుపాలెం సమీపంలో రహదారిపై ఒక్కసారిగా కుక్కలు ద్విచక్ర వాహనంకు అడ్డుగా రావటంతో అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో కోటయ్య కుడి కాలుకు తీవ్ర గాయమైంది. నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన కోటయ్యను చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముప్పాళ్ళ: ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్సై వీ సోమేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14వ తేదీన సత్తెనపల్లి మండలంలోని భృగుబండ గ్రామానికి చెందిన కోడె బూశయ్య, బాడుగుల వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనంపై మండలంలోని రుద్రవరం గ్రామంలో జరిగిన దశ దిన కార్యక్రమంలో పాల్గొని ఇంటికి బయలుదేరారు. ఊరు దాటాక పొలాల్లోంచి వ్యవసాయ పనులు ముగించుకొని ట్రాక్టర్ రోడ్డు ఎక్కే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న కోడె కాశయ్యకు స్వల్ప గాయాలు కాగా, వెంకటేశ్వర్లు తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన వారిని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వెంకటేశ్వర్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన మాదలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గోకనబోయిన పుష్పరాజ్‌పై మృతుడి అన్న కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు.

అందని ప్రయోజనం.. నెరవేరని లక్ష్యం

ప్రారంభానికి నోచుకోని బహుళ ప్రయోజన గోదాము

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం
- నాబార్డు నిధులు రూ.40 లక్షలతో పనులు పూర్తి
- ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా ఉన్న గోదాము
- అధికారంలోకి వచ్చి ఏడాదయినా పట్టించుకోని కూటమి ప్రభుత్వం


ప్రారంభానికి నోచుకోని నకరికల్లులోని బహుళ ప్రయోజన సౌకర్య గోదాము

నకరికల్లు: రైతులకు బహుళ ప్రయోజనాలు అందించాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మాణం పూర్తి చేసుకున్న బహుళ ప్రయోజన సౌకర్య గోదాము ఏడాదిగా ప్రారంభానికి నోచుకోలేదు. నకరికల్లులోని ఎస్సీ కాలనీలో సుమారు 25 సెంట్ల స్థలం కేటాయించి నాబార్డు ద్వారా సుమారు రూ.40 లక్షల నిధులతో గోదామును నిర్మించారు. 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యంతో నిర్మించిన గోదాము ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభం కాలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిగా పట్టించుకోకపోవడంతో నేటికీ ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారింది.

గోదాము ప్రయోజనాలివే...

500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదామును రైతులకు బహుళ ప్రయోజనాలు కల్పించే లక్ష్యంతో నిర్మించారు.

- ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు పండించిన ధాన్యం, అపరాలు తదితర పంటలను నామమాత్రపు రుసుముతో నిల్వ చేసుకోవచ్చు.
- గోదాము పక్కనే నిర్మించిన ప్లాట్‌ఫాంపై తడిసిన, తేమ కలిగిన ధాన్యం ఆరబోసుకోవచ్చు.
- అలాగే రైతులకు రాయితీపై ఇచ్చే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు నిల్వ చేసుకునేందుకు, పంపిణీ కార్యక్రమాలకు వినియోగించుకునేలా దీనిని నిర్మించారు.

మండలంలో సుమారు 19 వేల ఎకరాల్లో ప్రధానంగా వరి, కంది, మినుము, పెసర, మిర్చి తదితర పంటలను సాగు చేస్తారు. మండలంలోని 17 గ్రామాల్లో సుమారు 12,600 మంది రైతులు బహుళ ప్రయోజనాలు పొందే విధంగా ఈ గోదామును స్వల్ప పనులు మినహా పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి చేశారు. ప్రారంభానికి మాత్రం నోచుకోకపోవడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన లక్ష్యం నెరవేర లేదు.

చిన్న చిన్న పనులు కూడా చేపట్టని ప్రభుత్వం

గోదాములు రైతులు నిల్వ చేసుకునేందుకు తెచ్చిన వ్యవసాయ ఉత్పత్తులను కాటా వేసేందుకు పనిముట్లు, రశీదు పుస్తకాలు, పాడైపోయిన మార్గం సరిచేయడం, విద్యుత్ మరమ్మతులు లాంటి చిన్న చిన్న పనులు చేయాల్సి ఉంది. అయితే ఇలాంటి చిన్న పనులు కూడా కూటమి ప్రభుత్వం చేపట్టలేదు. ఫలితంగా గత వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన భారీ ప్రాజెక్టు ప్రయోజనాలు రైతులు పొందలేకపోతున్నారు. గోదాము ప్రారంభించకపోవడంతో ధాన్యం నిల్వ చేసుకునే సౌకర్యం లేని రైతులు అద్దె భవనాల్లో నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అద్దె భవనాలు అందుబాటులో లేని గ్రామాల్లోని రైతులు పొలాల్లోనే తమ పంటలను అప్పుడు ఉన్న ధరలకే అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అదే గోదాము అందుబాటులోకి వస్తే పంట ఉత్పత్తులను నిల్వ చేసుకుని గిట్టుబాటు ధర బాగా ఉన్నప్పుడు అమ్ముకుంటే రైతులకు ప్రయోజనం ఉంటుంది.

అనుమతులు రావాల్సి ఉంది

నకరికల్లులో నిర్మించిన బహుళ ప్రయోజన గోదాములో విద్యుత్, రోడ్డు మార్గం ఏర్పాటు లాంటి చిన్న పనులు పూర్తి చేయాల్సి ఉంది. కమిటీ ద్వారా నిర్వహణ బాధ్యతలు మాకు అప్పగించాల్సిన పనులు పూర్తి కావాల్సి ఉంది. నిర్వహణ ఏ విధంగా చేయాలి. రైతులకు ఏ విధమైన సేవలు అందించాలన్న విధివిధానాలు, ప్రారంభానికి సంబంధించిన అనుమతులు ఇంకా రావాల్సి ఉంది.

– కె.శ్రీనివాసరావు,
కార్యదర్శి, నకరికల్లు సొసైటీ

పోతురాజుకు సత్కారం


సత్కరించిన మాజీ ఎమ్మెల్యే నంబూరు

క్రోసూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కల్చరల్ వింగ్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన పోతురాజు శ్రీనివాసరావును పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు ఆదివారం రాత్రి సత్కరించారు. క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని పార్టీ నాయకులు పలువురు పాల్గొని శ్రీనివాసరావును అభినందించారు. అభినందించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు, ఎంపీటీసీ వేణుగోపాలరెడ్డి, అనుముల కోటిరెడ్డి, అప్పిరెడ్డి, జెడ్పీటీసీ షేక్ జమీల, నాయకులు గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

పణిదం సెక్టార్ డీపీఎంవో నాగేశ్వరరావునాయక్ బదిలీ



సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం పణిదం సెక్టార్ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ (డీపీఎంవో) దేశావత్తు నాగేశ్వరరావు నాయక్ బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన్ను ఉమ్మడి గుంటూరు జిల్లా లెప్రసీ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పణిదం సెక్టార్ నుంచి సోమవారం నాగేశ్వరరావు నాయక్ రిలీవ్ అయ్యారు. అయితే ఆయన స్థానంలో పణిదం సెక్టార్‌కు ఇంకా అధికారికంగా ఎవరినీ నియమించ లేదు. గత ఎనిమిది సంవత్సరాలుగా పణిదం సెక్టార్ డీపీఎంవోగా నాగేశ్వరరావు నాయక్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు సమీప మండలాలైన క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు, అమరావతి మండలాలకు సైతం అదనపు బాధ్యతలు నిర్వహించారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

బెల్లంకొండ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బెల్లంకొండలో సీపీఐ మహాసభ కార్యక్రమం నిర్వహించారు. మండల కార్యదర్శి వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు.

పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నప్పటికీ వాటిని అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారని.. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ ప్రజా నియంతృత్వ విధానాలను ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, జిల్లా ప్రజా నాట్య మండలి కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, రాయపూడి జాను, వివిధ గ్రామాల సీపీఐ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు మోదీ కృషి



అమరావతి: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మేకల హనుమంతరావు అన్నారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బీజేపీ అమరావతి మండల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం శ్యాంప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ మేకల హనుమంతరావు నివాసంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు వాడపర్తి పుల్లారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు, అమరావతి ఎంపీపీ హనుమంతరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు


అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారి

నూజెండ్ల: వసతి గృహం నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వంటగది నిర్వహణ, మరుగుదొడ్లను పరిశీలించారు. సిబ్బంది గైర్హాజరు కావటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు అనుమతులు లేకుండా సెలవులో ఉన్న వంట సహాయకులపై అసహనం వ్యక్తం చేశారు. ఇదే విధంగా కొనసాగితే విధుల నుంచి తొలగించటం జరుగుతుందని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల దినోత్సవంలో హాస్టల్ సిబ్బంది కొరతపై గ్రామ సర్పంచ్ ఫిర్యాదు చేయటంతో జిల్లా కలక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేయటం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలోని అన్ని బీసీ హాస్టల్స్‌లో సిబ్బంది కొరత ఉందని త్వరలో భర్తీ చేయటం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని వార్డెన్ ప్రభాకర్ రెడ్డికి సూచించారు. ఆయనతో పాటు నూజెండ్ల గ్రామ ప్రెసిడెంట్ వీర్ల వెంకటస్వామి ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి పది మంది విద్యార్థులు ఎంపిక

శావల్యాపురం: మండలం నుంచి పది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఈ అవకాశం దక్కినట్లు ఆయన తెలిపారు. శావల్యాపురం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి పి.సత్య, పి.జ్యోతిర్మయి, ఎల్.గాయత్రి, సి.హెచ్.నాగలక్ష్మి,ఎ.అమృత వర్షిణి, టి.కాత్యాయని, ఎం.సప్నిక, రత్న వేల్పూరు పాఠశాల నుంచి కామేపల్లి నాగరోషిణి, మానం జస్వంత్, పోట్లూరు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి సొలసా రూపశ్రీ అర్హత సాధించారన్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు ఆరు సంవత్సరాల పాటు ఉచిత బోధనతో పాటు వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందని ఎంఈవో తెలిపారు.

విద్యాశాఖ అధికారుల తీరు అభ్యంతరకరం

ఎంపీపీ కందుల జాను



దాచేపల్లి: మండల విద్యాశాఖ అధికారులు ప్రజాప్రతినిధులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీ కందుల జాన్ ఆరోపించారు. సోమవారం మండల పరిషత్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యాశాఖ పరంగా ఏ కార్యక్రమం జరుగుతున్న ఎంపీపీగా తనకు కనీస సమాచారం ఇవ్వటం లేదని, మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు నిర్వహించే సమావేశాలకు పిలవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీపీగా ప్రభుత్వ పాఠశాల నిర్వహణపై పర్యవేక్షించే బాధ్యత తనకు ఉందని, ప్రభుత్వ పాఠశాలను తనిఖీలు చేస్తూ విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి తనవంతు సలహాలు సూచనలు కూడా ఇచ్చే అవకాశం తనకు కల్పించాలన్నారు. ఇటీవల కాలంలో మండల విద్యాశాఖ అధికారులు నిర్వహించే ఏ సమావేశాలకు తనను ఆహ్వానించడం లేదని, ఎంఈఓ లు తనతో నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఎంఈఓలు తీరుపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు తాను ఫిర్యాదు చేస్తానని, ప్రజా ప్రతినిధులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని ఆయన పేర్కొన్నారు.

పరిష్కార వేదికలో మూడు ఫిర్యాదులు

యడ్లపాడు: సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మూడు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. మండలంలోని ఉన్నవ గ్రామంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురి అవుతుందని దానిని పరిరక్షించాలని గ్రామానికి చెందిన కూరాకుల సురేష్ ఫిర్యాదు చేశాడు. అలాగే మద్రిపాలెం, సొలస గ్రామాల్లో ఉన్న తమ భూములకు తాలూకు ఆధార్ డీసీడింగ్ చేయాలంటూ చెరుకుపల్లి హనుమంతరావు, పోతురాజు మోహన్‌రావు వినతులు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుర్చీల బహూకరణ



రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లలో గల అంగన్‌వాడీ కేంద్రానికి సోమవారం కుర్చీలను బహూకరించారు. గ్రామానికి చెందిన సరికొండ పద్మ అంగన్‌వాడీ కేంద్రానికి 20 కుర్చీలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మరియ కుమారి మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి అంగన్ వాడీ కేంద్రాలకు అవసరమైనవి ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలను బహూకరించిన పద్మను గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ బి.లక్ష్మి, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'యువత పోరు'కు తరలివెళ్లిన నిరుద్యోగులు

క్రోసూరు: వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు సోమవారం క్రోసూరు నుంచి నిరుద్యోగులు 'యువత పోరు' కార్యక్రమానికి నరసారావుపేటకు తరలివెళ్లారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి హామీలను తక్షణం అమలు చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అయితే ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు లాఠీచార్జి చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. యువత పోరుకు తరలిన వారిలో షేక్ బాజి, అనుముల రోశిరెడ్డి, అన్వర్, బషీర్, షబ్బీర్, నాగులు, పట్టేల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అవగాహనతోనే సికిల్‌సెల్ నిర్మూలన

పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సిరిచందన


పెరికపాడు తండాలో సికిల్‌సెల్ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

పెరికపాడు(క్రోసూరు): సంపూర్ణ అవగాహనతోనే సికిల్‌సెల్ అనీమియా వ్యాధిని నిర్మూలించవచ్చునని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సిరిచందన తెలిపారు. జూలై రెండవ తేదీ వరకు నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మండలంలోని పెరికపాడు తండా పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీచేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరిచందన మాట్లాడుతూ సికిల్‌సెల్ అనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లో భాగంగా వ్యాధికి సంబంధించి వివిధ వర్గాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్ మాట్లాడుతూ ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన తెగలకే సోకుతుందని, వారిలో మేనరికాలు, ఒకే రక్తం కలిగిన వారిని వివాహం చేసుకోవడం వల్ల వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధిని గుర్తించిన వెంటనే చికిత్స అందించడం వల్ల రోగులను ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చునని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాలలో ఐదు సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల లోపు వారికి ఆరోగ్య కార్యకర్తల ద్వారా సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలకు ప్రజలు సహకరించవలసినదిగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త నాగమల్లేశ్వరి, ఆశా కార్యకర్త సైదాబీ పాల్గొన్నారు.

బెల్లంకొండ తహసీల్దార్‌గా ప్రవీణ్‌కుమార్ బాధ్యతల స్వీకారం



బెల్లంకొండ: తహసీల్దార్‌గా టి.ప్రవీణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా బెల్లంకొండ తహసీల్దార్‌గా వచ్చారు. ఇప్పటివరకూ తహసీల్దార్‌గా పనిచేసిన షేక్ అశ్రఫున్నీసా బేగం మంగళగిరి సీసీఎల్ఏకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా, రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా పని చేస్తానని పేర్కొన్నారు.

లోపాలు పోగొట్టుకోవడానికి ఫిజియోథెరపీ దోహదం


భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న డాక్టర్ కుమారి

సత్తెనపల్లి: ప్రత్యేక అవసరాల పిల్లల్లో ఉండే లోపాలను పోగొట్టుకోవడానికి భవిత కేంద్రంలో ప్రతి సోమవారం అందించే ఫిజియోథెరపీ సేవలు దోహద పడతాయని ఫిజియోథెరపీ డాక్టర్ కె.కుమారి అన్నారు. పట్టణ వెంగళరెడ్డి నగర్‌లోని భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఫిజియోథెరపీ క్యాంపులో ఆమె మాట్లాడారు. సత్తెనపల్లి మండలం, మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు హాజరుకావడంతో వారికి ఫిజియోథెరపీ సేవలను అందించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ డాక్టర్ కుమారి మాట్లాడుతూ పిల్లలను ప్రతి సోమవారం జరిగే ఫిజియోథెరపీ క్యాంపుకు తీసుకు వచ్చి వారికి ఉన్న లోపాలను పోగొట్టుకోవటానికి ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. అంతేకాకుండా మండల పరిధిలోని వినికిడి లోపము, ఆటిజం, ఏడీహెచ్‌డీ తదితర ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు భవిత కేంద్రం సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ భవిత సెంటర్ సేవల గురించి తెలుసుకోవాలంటే ఏవీ శ్రీనివాస్ (ఐఈఆర్‌పీ) 8985900919 నంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. క్యాంపులో భవిత కేంద్రం ఐఈఆర్‌పీ ఏవీ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు విజయ్ కుమారి, ఎంపీపీ ఎస్వీఆర్ నగర్ హెచ్‌ఎం బెల్లంకొండ నాగసాయిప్రసాద్, పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యారు.

సచివాలయాల ఉద్యోగుల బదిలీల్లో నిబంధనలు సడలించాలి


వినతిపత్రం అందిస్తున్న సచివాయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు, ఉద్యోగులు

సత్తెనపల్లి: గ్రామ/ వార్డు సచివాలయాల ఉద్యోగులు సొంత మండలంలో పని చేయకూడదు అనే నిబంధనను తొలగించి స్థానిక మండలం, మున్సిపాలిటీలో ఎక్కడ అయినా పని చేయుటకు అవకాశం కల్పించాలని గ్రామ/వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ తరపున సచివాలయ ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల విషయంలో నెలకొన్న సందిగ్ధతపై సోమవారం గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావుని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ/ వార్డు సచివాలయాల ఉద్యోగులకు అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్స్, జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కల్పించాలని, ప్రమోషన్ చానల్ కల్పించాలని కోరారు. కార్యక్రమములో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, జిల్లా జనరల్ సెక్రటరీ ఏఎస్ఎస్ శ్రీనివాస్, సిటీ ప్రెసిడెంట్ ఎస్‌పీఎస్ సూరి, సత్తెనపల్లి ప్రెసిడెంట్ మణిరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి


తహసీల్దార్ ఎస్‌కేఎండీ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చిలకలూరిపేట: ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యం ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నారని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్, ఎంఈవో వీవీఎస్ చంద్రకళను కలసి సోమవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబర్ 53, 54 నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేటు విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేయడంతో పాటు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చివేశారని విమర్శించారు. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు టీసీ ఇచ్చేందుకు కూడా అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. క్రీడా మైదానాలు, లైబ్రరీలు, కనీస సౌకర్యాలు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని చోట్ల అపార్ట్‌మెంట్లలో తరగతులు నిర్వహిస్తున్నారని, అగ్ని ప్రమాదాలు వంటి సంభవిస్తే విద్యార్థులకు రక్షణ ఏమిటని ప్రశ్నించారు. అలాంటి విద్యాలయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీను నాయక్, ప్రైవేట్ టీచింగ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు, ఏఐవైఎఫ్ నాయకులు వెంకటేష్, మల్లిఖార్జున్, రాంబాబునాయక్ పాల్గొన్నారు.